# సాగరకిరటం

నవల

సి. ఉమాదేవి



సి. ఉమాదేవి

# సాగరకెరటం

సి. ఉమాదేవి

# సాగరకెరటం

సి. ఉమాదేవి

జె.వి. పబ్లిషర్స్
హైదరాబాద్

Sagarakeratam
By
C. Uma devi

First Published: 2014

© Author

C. Uma devi
Ph: 98858 09250
umadevi4769@gmail.com

Copies: 500

Rs. 100/-

*Cover design:*
Krishna Ashok
Ph: 95422 31998

*Printed at:*
Himalaya Graphics
Chikkadpally, Hyderabad.
Ph: 66100227, 65552357

*for Copies:*
All Major Book Shops

# ఒక్క క్షణం!

**మ**నిషి అంటే మానవత్వానికి చిరునామా అని చెప్పే మా అమ్మమ్మ మాటలకు చిన్నప్పుడే ప్రభావితమైన నేను ఆ మాటల సుగంధాన్ని నా భావాలకు మిళితం చేసి నాతోపాటు పెరగనిచ్చాను. చదువు, తరువాత వివాహం, వెన్నంటిన కుటుంబ బాధ్యతలు, ఆ తరువాత విద్యాసంస్థను ప్రారంభించి దానికే అంకితమవడం! మరి రచనలు? మనసు స్పందించినపుడు అక్షరానికి అల్లుకు పోవడమే! ఆ అక్షరార్చనే కవితలు, వ్యాసాలు, కథలు, నవలలు, సమీక్షలుగా రూపుదిద్దుకోనారంభించాయి. నా రచనలను ప్రచురించిన పత్రికా సంపాదకు లందరికీ మనసా నమామి. రాశిలో కవితల సంఖ్య గణనీయం కాదు. అయితే నాకు వచ్చిన అవార్డులు మాత్రం కవితలదే! 'అమ్మతనం' కవితకు డా॥ పోతుకూచి సాహితీ అవార్డు, 'మానవతకు చిరునామా' కవితకు ఎక్స్ రే అవార్డు, ఆంధ్రప్రభ – ఆరాధన సంయుక్తంగా నిర్వహించిన కవితల పోటీలో 'మనిషి నిర్వచనం' కవితకు బహుమతి.

తన వృత్తిలో తాను నిమగ్నమైనా, సాహిత్యపరంగా నాకు ప్రేరణ కలిగించే మా శ్రీవారు డా॥ సి. ఈశ్వరరెడ్డిగారు (విశ్రాంత ప్రొఫెసర్), కథలు చదవలేక పోయినా, నువ్వు చదువు నేను వింటాననే మనవడు చింటు (రాజశేఖరరెడ్డి), అమ్మమ్మా నాకోసం ఇంగ్లీష్‌లో రాయవూ అని అడిగే మనవరాలు అవని, సత్య, యం. శ్రీనివాస్, శశి, బి. శ్రీనివాస్ ఈ పుస్తకాల ప్రచురణకు ప్రోత్సాహం అందించినవారే. నా తొలి రచనలన్నీ ఎంతో ఇష్టంగా ఆశీర్వదించిన అమ్మ సరస్వతీదేవి, నాన్న బి. నారాయణరెడ్డిగారు భౌతికంగా దూరమైనా గుండెలోనే గూడుకట్టుకున్న వారి ఆశీస్సులు ప్రాతఃస్మరణీయమే!

పుస్తకానికి చక్కటి ముఖచిత్రాన్నందించిన శ్రీకృష్ణ అశోక్, డి.టి.పి., ప్రింటింగ్ చేయించిన జె.వి. పబ్లిషర్స్‌వారు అన్నిటినీ మించి నా రచనలు చదివి తమ స్పందన తెలియచేసే పాఠకులు, రచయితలు, రచయిత్రులు అందరూ ఈ పుస్తకం రూపుదిద్దుకోవడంలో నాకు ప్రేరణ కలిగించినవారే. ఇక అక్షరబాటలోకి అడుగుపెట్టండి మరి...

**– సి. ఉమాదేవి**

# సాగరకెరటం

**రా**త్రి పదకొండు దాటుతోంది. రాజధాని ప్రధాన వీధుల్లో త్రీస్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లు సద్దుమణుగుతున్నాయి. చిన్నా చితకా కాఫీ హోటళ్లు కొన్ని తొమ్మిదింటికే బోర్డులు తిప్పేసి సేదతీరుతున్నాయి. కనీకనబడని దీపపు వెలుగుల్లో ఇంద్రభవన్ తన వాడకందార్లకు ఆలూపరోటా వేడివేడిగా అందిస్తోంది. పేరులో మాత్రమే వైభవాన్ని ప్రతిఫలిస్తున్న ఆ హోటల్ పాతబడ్డ చెక్కకుర్చీలు, దుమ్మును ఆప్యాయంగా హత్తుకున్న నల్లరాతి టేబిళ్లతో మొరటుగా ఉన్నా, రుచిలో మాత్రం రాజీపడక తన రెగ్యులర్ కష్టమర్స్‌ని క్రమం తప్పకుండా అలరిస్తూనే ఉంది. చాకులాంటి కుర్రాడొకడు టేబిళ్లు తుడుస్తూ అడపాదడపా హోటల్ ద్వారం వైపు ఆత్రుతగా చూస్తున్నాడు. "దిక్కులు చూడ్డం మాని బేసిన్ ఖాళీ చేసి పట్రా ఫో!" ఇంద్రభవన్ యజమాని గద్దించాడు.

'ఇక ఈ రోజుకింతే! రోజూ దొరికే టిప్ దొరకదు. రూపాయి నష్టం. బిక్కముఖం వేసుకుని బేసిన్ నిండా ఎంగిలిపళ్లాలు మోస్తూ పంపు దగ్గరకు నడిచాడు ఆ కుర్రాడు. ఒక్కొక్క పళ్లెమే కడిగి, కడిగాక శుభ్రంగా తుడిచి పెట్టున్నాడు. మరుసటి రోజుకు అవన్నీ సిద్ధం కాకపోతే తన వీపు మీద ఎర్రటి చారలు తప్పవు అనుకున్నాడు. "క్యా సాబ్! బహుత్ లేట్ హోగయా ఆజ్! మీ మాస్టారు వదల్లేదా? అలసటగా లోనికడుగిడిన జగన్‌ను పలకరిస్తూ "అరేయ్ ఆలూ పరోటా జల్దీ లావ్!" అని అరిచాడు. పల్లె వదలి పట్నంలో కొన్నాళ్లుండి, ఆ తరవాత నగరం చేరుకుని అక్కడో ముక్కా, ఇక్కడో ముక్కా నేర్చుకున్న హిందీని స్టూడెంట్లు కష్టమర్లుగా వచ్చినపుడు మాత్రం ఇలా ప్రయోగిస్తుంటాడు ఇంద్రభవన్ యజమాని! అతడి తెలుగు యాస హిందీ చూశాక అంతవరకూ తన బుర్రను వేడెక్కించిన లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీని దులుపుకుని హాయిగా నవ్వేశాడు జగన్.

జగన్ రాకతో పళ్లేలు కడుగుతున్న కుర్రాడి ముఖం వికసించింది. గబగబా రెండు ఆలూ పరోటాలు తెచ్చి జగన్ ముందుంచాడు. ఆత్రంగా పరోటాలను తిన్నాక గాని జగన్ అటుఇటు చూడలేదు. కుర్రాడు 'టీ' తెచ్చాడు. వాడి చేతిలో

రూపాయి బిళ్ల పడగానే వాడి కళ్లు తళుక్కుమన్నాయి. వాడు తృప్తిగా లోనికి పరిగెట్టాడు, రూపాయి దేవుడి దగ్గర హుండీలో వేయడానికి.

జగన్ చుట్టూ చూశాడు. అక్కడక్కడా విసిరేసినట్టుగా ఒకరిద్దరు కూర్చుని పొగను వలయాలుగా వదులుతున్నారు. ఎక్కడో దూరంగా విజిల్‌తో పోలీసు జీపు వస్తున్న శబ్దం. ఇంద్రభవన్ యజమాని లైట్లన్నీ ఆర్పేసి జీరో బల్బు మాత్రముంచాడు.

"ఇక లేవండి సార్, పోలీస్ జీప్ వస్తోంది. హోటల్ కట్టెయ్యకపోతే పరేషాన్ చేస్తారు" వినయంగా చెప్పాడు అందరికీ.

"మేం పైసలిచ్చి కూర్చున్నాం, నీ ఇంట్ల షాదీకొచ్చి కూచోలా!"

కిళ్లీ నమిలిన రసాన్ని గోడమీదకు ఊసి నవ్వాడో వ్యక్తి.

"కోపమొద్దు సార్, అరేయ్ ఎక్కడ తగలడ్డావ్? షటర్ వేసేయ్!"

కుర్రాడు పైకెగిరి షట్టరును కిందకు గుంజాడు.

జీప్ శబ్దం దూరమయ్యింది. జగన్ లేచాడు. ఎంట్రన్స్ పరీక్షకు ఇంటినుండి రావాలంటే ఆలస్యమవుతుందని కోచింగ్ సెంటరుకు దగ్గరగా గది తీసుకున్నాడు. క్లాసయిపోగానే చవకగా తిండిపెట్టే హోటలిదొక్కటే! అమ్మచేతి గుత్తివంకాయకూర, ఉలవచారు గుర్తుకొచ్చాయి జగన్‌కు. అమ్మ వంట అద్భుతంగా చేస్తుంది. పాక కళ అంటే అమ్మ వంట రుచే అనుకుంటాడు జగన్. అయినా ఇప్పుడు రుచుల కన్నా ర్యాంక్ ముఖ్యం. పైగా ఇది రెండవ ప్రయత్నం. కోచింగ్‌లో రివిజను జరుగుతోంది. రోజూ పరీక్షలే! మరుసటి రోజు మ్యాథ్స్ పరీక్ష. ఇప్పుడు గదికి వెళ్లి చదవాలి. ఫార్ములాలతో కుస్తీ పట్టాలి. ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయాలి.

"షటర్ లేపు, నేను వెళ్లాలి" జగన్ పుస్తకాలు తీసుకొని షటర్ దగ్గర నిలబడ్డాడు.

అంతవరకూ సెక్యూరిటీ ఫీలవుతూ, మరికొంతసేపు ఇంటి ముఖం చూడకూడదనుకున్న 'పొగ' బాబులు 'వద్దు' అని అరిచారు ఒక్కసారిగా!

భయంగా తలాడించాడు హోటల్ యజమాని.

అది షటర్ లేపమనా? వద్దనా! తనే షట్టర్‌ను బలంగా పైకి లేపబోయాడు జగన్.

"సర్లే, పెద్ద మగాడివి బయల్దేరావ్! పోలీసు జీపు ఎంతో దూరం వెళ్లుందదు. లైటు కనబడిందా వెనక్కువస్తుంది. మరో అరగంట కూచో, అంతలో ఏం

కొంపలంటుకుపోవు" కిళ్లీతో గారపట్టిన పళ్లనన్నిటినీ ఇకిలించి చూపుతూ కసురుకున్నాడు ఇందాక గోడను పావనం చేసిన వ్యక్తి.

"పోనీలే వదిలెయ్యి గురూ, పిల్లకాకి!" మరొకడు జాలిపడ్డాడు. జగన్ కసలే మ్యాథ్స్ పరీక్ష టెన్షన్, మళ్లీ నైట్ అవుట్ చేయాలి. ఇలాంటి వాళ్లను హోటల్లోనికి రానిస్తున్న యజమాని వంక అసహనంగా చూసి, పొగరాయుళ్ల మాటలు విననట్లు కోపమంతా షట్టర్‌పై చూపాడు. దడదడలాడుతూ షట్టర్ రోల్ అయిపోయింది.

ఒకడు గభాల్న లేచి వచ్చి జగన్ మెడపై చెయ్యి వేసి, "అరే పోరా!" అని బయటకు తోశాడు. జగన్‌కు తన అభిమాన హీరో గుర్తుకొచ్చాడు. ఆ స్ఫూర్తి పనిచేసింది. అంతే క్షణమాలస్యం చేయకుండా తనను తోసిన వ్యక్తి చెంపను టార్గెట్ చేసుకున్నాడు. తగవునే టార్గెట్ చేసుకునేవాళ్లు, అక్కడకు చేరినవాళ్లు! ఒక్కసారిగా అందరూ వచ్చి జగన్‌పై కలబడ్డారు. నలుగురు ఆంబోతుల్లా తనపై లంఘించేసరికి జగన్‌లో భయం పుట్టుకొచ్చింది. 'సారీ, సారీ' అంటూనే ఉన్నాడు. కాని వాళ్లకది వినోదంగాను, ఎంకరేజింగ్‌గాను ఉంది. జగన్ చేతిలోనున్న పుస్తకాలు చెల్లాచెదరయ్యాయి. జగన్‌కు కళ్లు మసకబారాయి. అర్భకుడైన జగన్ వరుసగా పడ్డ దెబ్బలకు వెనక్కు పడ్డాడు. ఆ పడటంలో తలనేదో బలంగా తాకింది. జగన్ తలను ఢీకొన్న బండరాయి ఎర్రగా కందిపోయింది. అంతా సినిమాలోలా జరిగిపోతుంటే పళ్లాలు కడుగుతున్న కుర్రాడు నోటమాట రాక నిలుచుండి పోయాడు. "ఇక వేసుకోరా షట్టరు" అని వికృతంగా నవ్వుతూ వాళ్లంతా కదిలిపోయాక, అటు ఇటుచూసి బిక్కు బిక్కుమంటున్న గుండెతో పోలీస్ స్టేషన్‌కు డయల్ చేశాడు ఇంద్రభవన్ యజమాని.

❖ ❖ ❖ ❖ ❖

"నువ్విక ఇంటికెళ్లు రాజ్యం. వాడికేం గాదులే. రాత్రంతా వాడి మంచం దగ్గరే కంటిమీద రెప్పవాల్చకుండా కూచున్నావు. వాడిని నేను చూసుకుంటానులే. నువ్వు లే, లేచి ఇంటికెళ్లు." భార్యకు నచ్చచెప్పసాగాడు జనార్దనం.

"వద్దండీ, వాడికి మెలకువ రానివ్వండి. రాత్రంతా నొప్పికి అమ్మా అమ్మా... అంటూ మూలుగుతూనే ఉన్నాడు. వాళ్ల చేతులు పడిపోనూ. కుర్రసన్నాసి మీదనా ప్రతాపం? కొడుకును ఇంజనీరు చేసే మాటేమోగాని కొడుకునే లేకుండా..." రాజ్యం గొంతు గద్గదమయి మాట పూడుకుపోయింది.

జనార్దనం తన ఆశలు, ఆశయాలు కొడుకులపైనే పెట్టుకున్నాడు. ఉన్న ఒక్క కూతురికి పెళ్లయితే, ఆ తరువాత కొడుకులిద్దరికీ పెళ్లిళ్లు చేసి సంవత్సరాన్ని

సమంగా కొడుకులిద్దరి దగ్గరా పంచుకుందామనుకున్నాడు. లేదంటే వాళ్లను అమెరికా పంపించి అందరి తండ్రుల్లా కాకుండా అమెరికాలో పిల్లలున్న తండ్రుల్లా ఇండియాలోనే ఫారిన్ స్టేటస్ చూపొచ్చు అనుకున్నాడు. మరి అమెరికా వెళ్లాలంటే అడ్డదారో, రహదారో తప్పదు. రాజమార్గం అందరిదీ కాదు కదా. కొడుకు పుట్టిననాడే కొడుకును ఇంజనీరు చేయాలనే ఆశా పుట్టింది. మరో కొడుకు పుట్టాడు. ఆశ రెట్టింపయింది. 'తన పిల్లలు తనలా కష్టపడకూడదు. మరి నేనేదో వాడిని బలవంతపు పౌరోహిత్యం చేయిస్తున్నట్లు మాట్లాడుతుందే ఈ రాజ్యం' భార్య వంక అయోమయంగా చూశాడు జనార్దనం.

"సార్! మీ కోసం పోలీసులొచ్చారు" నర్సు వచ్చి చెప్పింది.

జనార్దనం, రాజ్యం గాభరాగా బయటకడుగేశారు. జగన్ అస్పష్టంగా మూలుగుతున్నాడు. పూర్తి మెలకువ రాని స్థితి.

❖ ❖ ❖ ❖ ❖

"సార్! మీ అబ్బాయి చిన్నప్పుడు చాలా అల్లరి చేసేవాడా?"

జనార్దనంకు నవ్వొచ్చింది.

"చిన్నప్పుడు అల్లరి చెయ్యని పిల్లలుంటారా?" ఎదురు ప్రశ్నించాడు యస్.ఐ.ని.

"అంటే... కాస్త పెద్దయ్యాక ఎవరితోనైనా గొడవలు పెట్టుకునేవాడా?" మరో ప్రశ్న.

"నాలుగో యేట నుండి కాన్వెంటులో కె.జి. చదువు. ఆ రోజునుండి కె.జిలకు కేజీలు పెరిగిన పుస్తకాలతోనే జట్టీపట్టేవాడు. ఇక ట్యూషన్లు, పరీక్షలు... ఊహూ... గొడవలకు ఆస్కారం లేదండి."

జనార్దనం జవాబులతో తృప్తి చెందలేదు యస్.ఐ. కేసుకు తగినంత మసాలా దొరకలేదు. పేలవంగా ఉన్న కేసు పరిశోధనలో థ్రిల్లునివ్వదు అనుకున్నాడు.

"అమ్మా, మీ అబ్బాయిని ఇంటికి దూరంగా ఎందుకుంచారు?" రాజ్యంవైపు చూస్తూ అడిగాడు యస్.ఐ.

తనొద్దంది. ఎక్కడో ఒకచోట చదువుకుంటాడులే అంది. తిండికి కష్టం అని గోలచేసింది. తండ్రి, కొడుకు ఇద్దరికిద్దరే. మళ్లీ రెండోసారి వ్రాస్తున్నందుకు ప్రిస్టేజీ అంటూ కొడుకు గోల, రెండు నెలలకు నీ కొడుకేం కరిగిపోడులే అని భర్త విరుపు, తన మాట కాదన్నారు. తనకే సర్ది చెప్పారు.

“నేనుంచలేదు బాబూ...” అంటూ భోరుమంది.

“హుష్! నీ ఏడుపాపు, నే సర్ది చెప్తాగా... నాయనా... మావాడి దెబ్బకన్నా మీ మాటలు మమ్మల్ని ఎక్కువగా బాధిస్తున్నాయి. ఇంటిదగ్గర టి.వి., చుట్టుపక్కల స్నేహితులు, ఎప్పుడో ఒకప్పుడు కబుర్లలో పడిపోతారు. ఒక్క నిమిషం కూడా వృథా చేయగూడదు కదా! అందుకే నగరానికి కాస్త దూరంగా ఉన్న కోచింగ్ సెంటర్‌లో నేనే చేర్పించాను. ఏదో ఆ హోటల్‌లో ఇంత తిని చదువుకుంటాడనుకున్నాము కాని, ఇలా తల పగలకొట్టుకుంటాడనుకోలేదు” జనార్దనం వివరణ కొంతవరకూ యస్.ఐ.ని శాటిస్‌ఫై చేసినట్లుంది. “వాడినెవరు కొట్టారో, ఎందుకు కొట్టారో హోటలు ఓనరు మీకెంత చెప్పాడో మాకూ అంతే చెప్పాడు. మీ పుణ్యమా అని మాకు తెలిసింది. దానికి మా కృతజ్ఞతలు.” రెండు చేతులూ జోడించాడు జనార్దనం. యస్.ఐ.లో పోలీసు మాయమై మనిషి నిలిచాడు. తను అనవసరంగా అనుమానిస్తున్నాడేమో ఈ కుర్రాడిని. సరే! ఒక కేసు జారవిడిచేద్దాం. అయినా ఈ చదువులు కాదుగాని, విద్యార్థులు రకరకాలుగా బలయిపోతున్నారు. అందుకే వీరిని విసిగించి ఆరా తీయవలసి వచ్చింది. “మీ అబ్బాయిని మీరు ఇంటిదగ్గరే ఉంచుకోండి, ఇలాంటి చిన్న చిన్న తగవులే రేపు పెద్ద నేరాలకు దారితీస్తాయి. నేనింకా కేసు బుక్ చేయలేదు. ఎవరినైనా అరెస్ట్ చేస్తే మాత్రం మీ అబ్బాయి, మీరు స్టేషనుకు రావలసి ఉంటుంది.” యస్.ఐ. ఖచ్చితంగా చెప్పాడు.

జనార్దనం ఉలిక్కిపడ్డాడు. రేపొద్దున్న కొడుకుకు అమెరికా అవకాశం వస్తుంది. ఇలా పోలీస్‌స్టేషన్లో పడితే గాడ్! పాస్‌పోర్ట్ రావద్దా?

“ప్లీజ్ సారీ సార్, వాడికి పరీక్షలున్నాయి కదా!” జనార్దనం వేడికోలుగా అన్నాడు.

“అవసరమైతేనేలే. లేకపోతే లేదు. మీరేం వర్రీ కాకండి” యస్.ఐ. ధైర్యం చెప్తున్నట్లుగా నవ్వాడు.

“సార్! మీ అబ్బాయికి మెలకువ వచ్చింది. అయితే పలకరించకుండా చూసి రండి.” నర్సు వచ్చి చెప్పింది.

యస్.ఐ.కూడా కదలబోయాడు.

‘సర్! ప్లీజ్, డాక్టరుగారు పేషంటును డిస్టర్బ్ చేయవద్దన్నారు.” యస్.ఐ. నిట్టూర్చి జీపుకేసి కదిలాడు.

❖ ❖ ❖ ❖ ❖

పెద్ద పెద్ద చదువులు చదివి తమని ఉద్ధరించనక్కర్లేదు, కొడుకు కళ్లముందు క్షేమంగా ఉంటే చాలనుకుంది రాజ్యం. పరీక్ష మరెంతో దూరం లేదు. అప్పు తెచ్చి కట్టిన భారీ ఫీజు జనార్ధనానికి విలువ రాబట్టుకోమంటోంది. పిల్లల భవిష్యత్తును కలలు కనడం వేరు, కలలను సాఫల్యం చేసుకోవటం వేరు. కాని ప్రయత్నం మానవ నైజం. తండ్రి తన గురించి కన్న కలలు జగన్‌కు తెలుసు. అందరు విద్యార్థులు ఎంట్రన్స్ పరీక్షకు తయారవుతుంటే తనిలా హాస్పిటల్ బెడ్‌మీద తల్లిచేత సేవలు చేయించుకుంటూ ఎలా? అని సిగ్గుతో చితికిపోతున్నాడు. తండ్రి ఆఫీసుకు వెళ్తూ తల్లిని తన దగ్గర వదిలి వెళ్తాడు. ఆ రోజు జగన్‌కు కొద్దిగా జ్వరం కూడా వచ్చింది. తల్లి వస్తోందేమోనని ఆశగా అడుగుల చప్పుడు వినబడినపుడల్లా నీరసంగా కళ్లు విప్పార్చి చూస్తున్నాడు. ఎవరో ఏ ఆయానో, హౌస్ కీపరో గది శుభ్రంగా ఉండేలా వచ్చి చూసినపుడల్లా జగన్ తల్లే అనుకుంటున్నాడు. ఎందుకో ఆలస్యమయింది అనుకుంటూ మగతగా పడుకున్నవాడు నెమ్మదిగా నిద్రలోకి జారాడు.

'లేద్సార్! ఒక్క నిమిషం సార్! రెండే రెండు బిట్స్ సార్. పేపర్ ఇచ్చేస్తాను సార్ ప్లీజ్, ప్లీజ్.'

కొడుకు కలవరింతలకు కొడుకు నుదురుపై చేయివేసి చూసి "నాన్నా... జగన్... ఏమిటిరా కలవరింతలు..." రాజ్యం లాలనగా అడిగింది.

"అమ్మా!" తల్లి చేతిని గాభరాగా, భయంగా పట్టుకున్నాడు జగన్.

ఒళ్లంతా చమటలు కారిపోతున్నాయి.

"ఎప్పుడొచ్చావు అమ్మా! నీకోసం చాలాసేపు చూశాను" బెంగగా అడిగాడు జగన్.

పసిపిల్లాడిలా అడుగుతున్న పదిహేడేళ్ల కొడుకును ఆప్యాయంగా చూస్తూ,

"నువ్వు మంచి నిద్రలో ఉన్నావురా. నీకీవేళ మంచి వార్తలు రెండు తెచ్చాను. సరే, నిద్రలేపడమెందుకని ప్రక్కనే కూర్చున్నా."

జగన్ కన్నుల్లో ఆసక్తి చూసిన రాజ్యం, "అన్నీ చెప్తానుగాని ముందు బ్రష్ చేసుకుని పాలు త్రాగు. ఇడ్లీ, కందిపొడి తెచ్చాను. నిన్నటిలా వదిలెయ్యకుండా తినెయ్యాలి. చూడెలా పీక్కుపోయిందో ముఖమంతా" కొడుకు నుదుటిమీద చెమట కతుక్కున్న వెంట్రుకలను సర్దుతూ అంది రాజ్యం.

అంతలో నర్సు వచ్చింది. థర్మామీటరు, చార్టు పట్టుకుని. జగన్‌కు టెంపరేచర్ చూసింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sagarakeratam**

* * *